క్లుప్తంగా

రేపు ఆమనగల్లులో ఎమ్మెల్యే పర్యటన

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో రూ.15 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ శంకుస్థాపన చేస్తారని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ కింద ఆమనగల్లు మున్సిపాలిటీకి రూ.15 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. సమావేశంలో వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్లు లక్ష్మణ్, విక్రంరెడ్డి, చెన్నకేశవులు, విజయ్‌కృష్ణ, కృష్ణనాయక్, నాయకులు నర్సింహ, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

తుర్కయంజాల్: మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించడంతో పాటు, వారాంతపు సెలవులు ఇవ్వాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్ అన్నారు. తుర్కయంజాల్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ధర్నా చేపట్టారు. ధర్నాలో పాల్గొన్న కిషన్ మాట్లాడుతూ.. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్‌లో కూడా అనేక లోటుపాట్లు ఉన్నాయని.. ఎండలు తీవ్రంగా ఉన్నందున మధ్యాహ్నం 12గంటల వరకే కార్మికుల చేత పనిచేయించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

కూలీలకు 'ఉపాధి' డబ్బులు చెల్లించాలి

కార్మిక సంఘం మండల అధ్యక్షుడు యాదయ్య

మంచాల: ఉపాధి కూలీలకు తక్షణమే పెండింగ్ డబ్బులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఆవుల యాదయ్య డిమాండ్ చేశారు. మంచాల మండలంలోని లింగంపల్లి గ్రామంలో సోమవారం ఉపాధి పనిచేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. వేసవి ఎండలను సైతం తట్టుకొని కూలీలు పనులు చేయడం జరుగుతుందన్నారు. కనీసం వారికి చేసిన పనికి సకాలంలో కూలీ డబ్బులు చెల్లించకపోవడం దారుణమన్నారు. మంచాల మండలంలో 8 వారాల నుంచి కూలీలకు చేసిన పనికి కూలీ డబ్బులు రావడం లేదన్నారు. ఎండాకాలం నేపథ్యంలో 30 శాతం అదనపు కూలీ డబ్బులు కలిపి ఇవ్వాలన్నారు. మూడు రోజుల్లో పెండింగ్ డబ్బులు చెల్లించకుంటే మండల కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు లక్ష్మయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని గుర్రంగుట్టకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు జంగయ్య ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలయడంతో సోమవారం జంగయ్యను నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తానని మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌లో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ముజీబర్ రహ్మాన్‌తో కలిసి సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మంజూర్ చేసిన రూ.2.50 లక్షల నిధులతో రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్యే సహకారంతో వెల్జాల్ గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శరత్ కుమార్, రైతు కోఆర్డినేటర్ నరేందర్‌గౌడ్, విష్ణువర్ధన్, అంజి, అశోక్, రవి, వెంకటయ్య, సుల్తాన్, వెంకట్‌రెడ్డి, యాదయ్య, శ్రీను, జంగయ్య, అంజిరెడ్డి, బుచ్చయ్య, రహ్మాన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు క్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- సహకార సంఘం నూతన బ్రాంచి భవన నిర్మాణానికి శంకుస్థాపన



సహకార సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: సహకార సంఘం సేవలను రైతులకు చేరువ చేసేందుకు బాటసింగారం సహకార సంఘం తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గల బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో.. నూతనంగా బాటసింగారం గ్రామంలో నిర్మిస్తున్న బ్రాంచి కార్యాలయ నిర్మాణానికి సోమవారం సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు క్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేయాలని.. ప్రభుత్వం అందించే పథకాల ద్వారా రైతులకు మేలు చేసేందుకు కృషి చేయాలన్నారు. సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి మాట్లాడుతూ.. కేవలం మండల కేంద్రంలోనే సంఘ కార్యాలయం ఉండటంతో రైతులకు, ఖాతాదారులకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు రవాణా, సమయం వృథా అవుతున్న కారణంగా వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బాటసింగారం గ్రామంలో సొంత భవనంతో మరో బ్రాంచికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తారమతిపేట, పెద్దఅంబర్‌పేట గ్రామాల్లో బ్రాంచీలను కొనసాగిస్తున్నామని తెలిపారు. సంఘం పరిధిలోని రైతులందరికీ సంఘం సేవలను విస్తరింపజేయాలన్నదే లక్ష్యంగా పాలకవర్గం, అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎర్రబెల్లి లతాశ్రీ, పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, సంఘం వైస్ చైర్‌పర్సన్ మల్లమ్మ, మేనేజర్ ఐలేష్‌యాదవ్, డైరెక్టర్లు, సహకార సంఘం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

యాచారం: మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన బీరప్ప ఉత్సవాల్లో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని కుర్మ కులస్తులు పెద్దతుల్ల రోడ్డు లో బీరప్ప దేవాలయాన్ని నిర్మించారు. ఆలయం లో పలు దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించా రు. బీఆర్ఎస్ నేతలు క్యామ మల్లేష్, కొత్తకుర్మ సత్తయ్య, కాంగ్రెస్ నేతలు.. ఈసీ శేఖర్‌గౌడ్, యాచారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గునుగల్ సర్పంచ్ ఇందిర తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రీడలతో ఐక్యత, స్నేహభావం

ఐక్యతా ఫౌండేషన్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి



బహుమతులు అందజేస్తున్న వరప్రసాద్‌రెడ్డి

తలకొండపల్లి: క్రీడలు ఐకమత్యం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఖానాపూర్‌లో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడాపోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి వరప్రసాద్‌రెడ్డి హాజరై ఐక్యత ఫౌండేషన్ నిధులచే సమకూర్చిన బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిగా గెలుపొందిన ఖానాపూర్ సూపర్‌లీగ్ కింగ్స్ జట్టుకు రూ.25,000, ద్వితీయ బహుమతిగా గెలుపొందిన ఖానాపూర్ బాయ్స్ జట్టుకు రూ.15,000, తృతీయ బహుమతిగా గెలుపొందిన ఖానాపూర్ న్యూలెజండ్స్ జట్టుకు రూ.5000 అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, భరత్, శివ, ఆర్గనైజర్స్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలి



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు రాములు

ఆమనగల్లు: విద్యార్థి దశ నుంచే.. తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం నేర్చుకోవాలని లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాములు, ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామ పరిధిలోని అయ్యసాగరం క్షేత్రంలో శృతిలయ కల్చరల్ అకాడమీ, ఐక్యతా ఫౌండేషన్, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులకు విద్యార్థులచే పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాద్‌రెడ్డి, పాపిశెట్టి రాము మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో ఉండటం నేర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదుగుతారని అన్నారు. తల్లిదండ్రులను, గురువులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని వారు సూచించారు. వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, సభ్యులు శంకర్, ఆచార్య రమేశ్ గురుజీ, రామాచారి గురుజీ, శృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్‌దాస్, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు, ఉపసర్పంచ్ రమేశ్‌గౌడ్, సలహాదారుడు తిరుపతయ్యగౌడ్, ధనలక్ష్మి, కవిత, వెంకటేశ్, సంతోష్, రజిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే పేదలకు న్యాయం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

యాచారం: ప్రజా పోరాటాలతోనే పేదల సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం పార్టీ మండల కార్యవర్గ సమావేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక, నల్లాచట్టాలు తేవడంతోనే కర్ణాటకలో ఓటమి పాలైందని అన్నారు. కేసీఆర్ సర్కార్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పరిశ్రమలు, ప్రాజెక్టుల పేరుతో వేలాది ఎకరాల వ్యవసాయ భూములను లాక్కుంటోందని ఆరోపించారు. ఫార్మాసిటీ పేరుతో వేలాది ఎకరాల వ్యవసాయ భూములను తీసుకుని పేదలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. ఫార్మాకు పట్టా భూములు ఇవ్వని రైతుల పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో సీపీఎం జెండా ఎగిరేలా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.మధుసూదన్‌రెడ్డి, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు పి.అంజయ్య, పెద్దయ్య, జగన్, తావునాయక్, చందునాయక్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్లామిక్ దేశంగా మార్చేందుకు కుట్ర

- దేశంలో హిందువులపై కుట్ర: ఎమ్మెల్యే రాజాసింగ్
- మతమార్పిడిలను అడ్డుకోవాలని పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

ఇబ్రహీంపట్నం: దేశంలో హిందువులపై కుట్రలు జరుగుతున్నాయని, దీనిని తిప్పికొట్టాలని హిందువాహిని జాతీయ నాయకుడు, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పిలుపునిచ్చారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని హిందువాహిని ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన హిందు జాగరణ్ శోభాయాత్ర సభలో అయన మాట్లాడారు. ఛత్రపతి శివాజీ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని, లవ్ జిహాద్, మత మార్పిడిలకు పాల్పడితే అడ్డుకోవాలని, ఘన ధర్మాన్ని, సంస్కృతిని దేశాన్ని నాశనం చేసేందుకు యత్నిస్తున్న వారి కుట్రలను తిప్పికొట్లాలని ఆయన పిలుపునిచ్చారు. మతాన్ని మార్చేందుకు వస్తున్న వారిని హిందువాహిని అడ్డుకుంటే తప్పుడు కేసులు పెట్టి జైళ్లకు పంపుతున్నారని ఆరోపించారు. దేశాన్ని ఇస్లామిక్ దేశంగా మార్చేందుకు కుట్ర జరుగుతోందని తెలిపారు. హిందువుల జనాభా తగ్గుతుంది. ఇతర మతానికి చెందిన వారి సంఖ్య పెరుగుతోందని, దీన్ని అరికట్టేందుకు దేశ ప్రజలందరికి ఒకే చట్టం తీసుకురావాలని ప్రధాని మోదీకి రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. ఇబ్రహీంపట్నం కోనకట్ట వద్ద 108 అడుగుల హనుమాన్ విగ్రహన్ని పెట్టేందుకు యత్నిస్తుంటే కొన్ని రాజకీయ శక్తులు అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. టెర్రరిస్టులు, తీవ్రవాదులను ఎదుర్కొనేందుకు కలిసికట్టుగా హిందువులు ఓ శక్తిగా అవతరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హిందు వాహినికి చెందిన వీరేందర్‌జీ, ఉప్పల రాజుతోపాటు పలువురు పాల్గొన్నారు. కాగా హిందు వాహిని నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా 108 మంది చిన్నారులు హనుమాన్ వేషధారణలో శోభాయాత్ర ర్యాలీలో పాల్గొన్నారు.

తెలంగాణలో అధికారంలోకి వస్తాం

కాంగ్రెస్ నేత ఈసీ శేఖర్‌గౌడ్

యాచారం: తెలంగాణ ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌ను గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ నేత ఈసీ శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో సోమవారం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌ను మళ్లీ గెలిపించడానికి ప్రజలు ఆసక్తితో ఉన్నారని అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కూడ కాంగ్రెస్ గెలవడం ఖాయమని అన్నారు. పేద ప్రజలనుబీఆర్ఎస్, బీజేపీలు రెండూ మోసం చేశాయన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పేద ప్రజలకు ఏం మేలు చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు ఇళ్లు, రుణమాఫీ, ఉద్యోగాలు వస్తాయని అన్నారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్ష

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ అలుగు వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు చేపట్టిన దీక్ష సోమవారం ఆరోరోజుకు చేరుకుంది. గ్రామస్తులు స్వచ్ఛందంగా దీక్ష చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం పట్ల మండిపడుతున్నారు. ప్రస్తుతం వేయాలనుకుంటున్న సీసీ రోడ్డు శాశ్వతం కాదని, బ్రిడ్జి నిర్మాణమే సమస్యకు శాశ్వత పరిష్కారమన్నారు. తక్షణమే బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 17, వంకాయ 18, బెండ 35, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 35, క్యాబేజీ 15, ఫ్రెంచ్ బీన్స్ 75–115, క్యారెట్ 38, దొండ 18–23, చిక్కుడు 60, గోకర 45, బీట్‌రూట్ 25, క్యాప్సికం 40, ఆలు 20, దోస 15, సొర 7, పొట్ల 13, ఉల్లి 14 చామగడ్డ 35.
గమనిక: మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు.

గౌరెల్లిలో షార్ట్ ఫిల్మ్ షూటింగ్



అబ్దుల్లాపూర్‌మెట్: కీర్తిరెడ్డి క్రియేషన్ బ్యానర్‌పై దర్శకుడు రావుల మోహన్‌రెడ్డి నిర్మిస్తున్న కుటుంబ విలువలు చాటిచెప్పే సందేశాత్మక షార్ట్ ఫిల్మ్ 'వంతు' చిత్ర షూటింగ్ అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లి గ్రామ పరిసర ప్రాంతాల్లో జరిగింది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రావుల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ చిత్రంలో కేవలం ఒకే పాత్రతో సినిమా మొత్తం ఉంటుందని అలాంటి అద్భుతమైన పాత్రని ప్రముఖ దర్శకుడు పీసీ ఆదిత్య పోషించడం విశేషమన్నారు. తల్లిదండ్రులు పిల్లలు బాగుండాలని తమ జీవితాన్ని త్యాగం చేసి కడుపు కట్టుకొని కూడబెట్టిన ఆస్తులను.. పంచుకోవడంలో తమవంతు ఉందని హక్కుల కోసం కొట్లాడటంతోపాటు అదే తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉన్నప్పుడు కొడుకులు వంతులు పాటిస్తూ తల్లిదండ్రుల జీవితాన్ని దుర్భరంగా మారుస్తూ సమాజంలో జరిగిన వాస్తవ కథ ఆధారంగా ఈ చిత్రం నిర్మిస్తున్నామని తెలిపారు. కుటుంబ విలువలను చాటిచెప్పే విధంగా ఈ చిత్రం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ చిత్రానికి కెమెరామెన్ గా ఆర్బీ మహాముఖేష్ వ్యవహరిస్తున్నారు. త్వరలో పోస్ట్ ప్రొడక్షన్ పనులను పూర్తిచేసి చిత్రాన్ని విడుదలచేస్తామని దర్శకుడు మోహన్‌రెడ్డి తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

వనస్థలిపురం: వనస్థలిపురం ద్వారకామయినగర్ కాలనీలోని శ్రీ త్రయోదశ ఆలయాల సంస్థ ట్రస్ట్ బోర్డుకు నూతనంగా నియమితులైన సభ్యులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈఓ రవీందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ వారితో ప్రమాణం చేయించారు. ట్రస్టీలుగా నక్క ఉమేష్‌కుమార్ (ఎఫ్ఎఫ్ఎం), కొర్రపాటి లక్ష్మీపతిరావు, బొందుగుల సరళారెడ్డి, సుదెం శేఖర్ సాగర్, నెల్లికొండ సత్యనారాయణగౌడ్, కొమిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, భూక్యా విజయ, అర్చకులు బండారు విజయశంకర్ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు కె.ప్రభులింగం, కార్యదర్శి ఎస్.ప్రవీణ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్రీడాపోటీలు

- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- గ్రామాల్లో అట్టహాసంగా సీఎం కప్ పోటీలు ప్రారంభం



ఆమనగల్లు: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మండలస్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ అనురాధ, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, రైతు సమన్వయ సమితి కన్వీనర్ నారాయణ, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పత్యానాయక్, ఎంపీటీసీ సరిత పంతునాయక్, సర్పంచ్‌లు మంజుల, లక్ష్మణ్, శ్రీనయ్య, సీఐ ఉపేందర్, ఎస్ఐ సుందరయ్య, ఎంపీడీఓ ఫారూక్‌హుస్సేన్, ఎంపీఓ శ్రీలత, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్, నిర్వాహకులు పాల్గొన్నారు.

మాడ్గులలో..

మాడ్గుల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం మండలస్థాయి సీఎం కప్ క్రీడా పోటీలను మాడ్గుల ఎంపీపీ పద్మారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, ఎంపీడీఓ రాఘవులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి..

యాచారం: క్రీడల పట్ల యువతీ, యువకులు ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. యాచారం ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం సీఎం కప్ క్రీడా పోటిలను ఆమె ప్రారంభించారు. యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సుచరిత, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, మండల పంచాయతీ అధికారి ఉమారాణి, సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ప్రజా పరిషత్ క్రీడా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సీఎం కప్ మండలస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు కమిటీ చైర్మన్, ఎంపీపీ తిర్మణి నిర్మల ప్రారంభించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక చేస్తామని పీఈటీ మల్లేశ్ చెప్పారు. ఎంపీడీఓ శ్రీకాంత్, ఎంఈఓ సర్దార్‌నాయక్, సర్పంచ్‌లు లలితాజ్యోతయ్య, కుమార్, ఉపసర్పంచ్ అనిల్, ఎంపీటీసీ హేమరాజు, హెచ్ఎం భగ్‌వాన్‌రెడ్డి, పీఈటీలు మల్లేశ్, పాండు, రఘుమారెడ్డి, పరమేష్, కృష్ణ, రాజేష్, శ్రీకాంత్, శంకర్, జ్యోతయ్య, ఎంపీఓ రఘు,సూపరింటెండెంట్ శ్యాంసుందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

చర్లపటేల్‌గూడలో..

ఇబ్రహీంపట్నం: సీఎం కప్-2023 క్రీడలను చర్లపటేల్‌గూడలోని మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ కళాశాలలో సోమవారం ఎంపీపీ కృపేశ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీతారాంరెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, ఉపసర్పంచ్ నరేందర్, మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, తహసీల్దార్ రామ్మోహన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

మంచాల మండల కేంద్రంలో..

మంచాల: మండల కేంద్రంలో సీఎం కప్ క్రీడోత్సవాలను సోమవారం ఎంపీపీ నర్మద ప్రారంభించారు. ఈనెల 17వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయన్నారు. మంచాల పీఏసీఎస్ చైర్మన్ బుస్సు పుల్లారెడ్డి, మంచాల సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి, తిప్పాయిగూడ సర్పంచ్ పాండు, ఎంపీటీసీ సభ్యుడు ఎడ్మా నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఎం శోభ, వివిధ గ్రామాలకు చెందిన పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మంచాల: క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ఎంపీపీ నర్మద, నాయకులు

జాతీయస్థాయికి ఎదగాలి

కడ్తాల్: గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సీఎం కప్-2023 పోటీలను ఆయన ప్రారంభించారు. సింగిల్‌విండోచైర్మన్ వెంకటేశ్ గుప్త, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓమధుసూధనాచారి, రావిచేడ్, మక్తమాధారం సర్పంచ్‌లు భారతమ్మ, సులోచన తదితరులు ఉన్నారు.



కడ్తాల్: క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు



ఇబ్రహీంపట్నం: క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎంపీపీ కృపేశ్

తరుగు పేరుతో దోచుకుంటున్నారు: ఎంపీటీసీ

యాచారం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో అధికారులు.. రైతులను మోసం చేస్తున్నారని మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు కొర్ర జ్యోతి ఆరోపించారు. మంతన్‌గౌరెల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. కొనుగోళ్లల్లో తరుగు పేరుతో బస్తాకు 4 నుంచి 6 కిలోలు దోచుకుంటున్నారని రైతులు ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. రైతులకు బస్తాలు ఇవ్వడం లేదని.. దీంతో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరావడం కష్టంగా మారిందన్నారు. అధికారులు తక్షణమే ధాన్యం బస్తులు ఇవ్వడంతో పాటు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తూకాల్లో మోసాలపై విచారణ జరపాలన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ చేసిన సీఐ ఉపేందర్

ఆమనగల్లు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆమనగల్లు సీఐ ఉపేందర్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో సోమవారం కోనాపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు కంబాలపల్లి రవి సమకూర్చిన స్పోర్ట్స్ డ్రెస్సులను క్రీడాకారులకు సీఐ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు ఎస్ఐ సుందరయ్య, పీఈటీ పాండు, నాయకులు భాస్కర్, కిరణ్‌కుమార్, సాయిరెడ్డి, శివ, మల్లేశ్, కిరణ్, ప్రశాంత్, శివమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే కోనాపూర్ సర్పంచ్ కడారి మల్లమ్మయాదయ్య, ఎంపీటీసీ సరిత పంతునాయక్‌లు సమకూర్చిన స్పోర్ట్స్ డ్రెస్సులను జెడ్పీటీసీ అనురాధ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పత్యానాయక్, తల్లోజు రామకృష్ణ, రమేశ్, మల్లేశ్, వస్పుల సాయిలు, చంద్రునాయక్, ఆనంద్, దేవేందర్, రాములు, శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.